

బ్రహ్మచారిణిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రెండో రోజు జోగులాంబ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రోజూ ఆలయంలో ఆర్జిత సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం సహస్రనామార్చన, కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణ అర్చన, చండీహోమం, రాత్రి 7 గంటలకు కొలువు పూజలో భాగంగా సువాసిని, కుమారి పూజలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ రథంపై ప్రదక్షణ నిర్వహించారు. ఈవో పురేందర్, అర్చకులు, ధర్మకర్తల సభ్యులు పాల్గొన్నారు.

గజలక్ష్మిగా జములమ్మ



దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జమ్మిచేడు జములమ్మ అమ్మవారు రెండో రోజైన శుక్రవారం భక్తులకు గజలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం

పకడ్బందీగా డిజిటల్ కార్డులు



గద్వాలలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, న్యూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభమైంది. ప్రతి కుటుంబానికి ఆధార్, రేషన్ కార్డు, ఆరోగ్యం, ఇతర సంక్షేమ పథకాల లబ్ధికి ఒకే డిజిటల్ కార్డు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి ఒక గ్రామం, ఒక పురపాలిక వార్డును ఎంపిక చేసి, ఆ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక బృందాల ద్వారా సేకరిస్తున్నారు.

నోడల్ అధికారుల పర్యవేక్షణలో..: ఎంపిక చేసిన గ్రామాలు, పురపాలిక వార్డుల్లో సర్వే నిర్వహించడానికి జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఇద్దరు నోడల్ అధికారులతో పాటు, సిబ్బందిని నియమించారు. గద్వాలకు జిల్లా భూ సేకరణ అధికారి శ్రీనివాసరావు, అలంపూర్‌కు ఆర్డీవో రాంచందర్ ఆధ్వర్యంలో ఈ సర్వే పనులు జరుగుతున్నాయి. ఈ నెల 8వ తేదీ వరకు రోజూ నివాస గృహాల వారీగా పూర్తి స్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన ఫాంలో నమోదు చేస్తున్నారు.

సర్వే ఇలా : ● డిజిటల్ సర్వేకు 200లోపు కుటుంబాలున్న గ్రామాలు, 500 ఇళ్లలోపు ఉన్న వార్డులను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ● కుటుంబ యజమానితోపాటు పిల్లలు, పెద్దలు, చంటి పిల్లలతో సహా సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలను చిరునామా, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ తీసుకుంటారు. ఒక్కొక్కరికి ఒక్కో నంబర్‌ను కేటాయిస్తారు. అన్ని వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. కుటుంబ సభ్యుల వద్ద ఉన్న ఆరోగ్య కార్డులు, ఇతర వివరాలను నమోదు చేస్తారు. ● రేషన్ కార్డుతో సహా ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తున్నారు. పింఛను లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు భరోసా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ ఇలా అన్ని వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. ● కుటుంబ సభ్యులు సమ్మతితో ఫొటోలు తీసుకుంటున్నారు.

● అన్ని వివరాలు సేకరించిన తరువాత నమూనా డిజిటల్ కార్డులపై ప్రత్యేక నంబర్‌ను కేటాయించనున్నారు.

● ఈ పైలెట్ ప్రాజెక్టులో డిజిటల్ సర్వే కోసం పకడ్బందీగా వివరాలు సేకరించి, లోటుపాట్లను పరిశీలించి ఇదే నమూనాను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

● అయిదు రోజుల్లో వివరాల సేకరణ పూర్తి చేయనున్నామని, సర్వే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టనున్నట్లుగా ఆర్డీవో రాంచందర్ తెలిపారు.

డిజిటల్ కార్డు పంపిణీ కోసం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గద్వాల పట్టణంలోని 9వ వార్డులో సర్వేను శుక్రవారం కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. సర్వేను సోమవారానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పులకు తావులేకుండా వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూసేకరణ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ మల్లికార్జున్, ఉన్నారు.

జిల్లాలో ఇలా...

గద్వాల నియోజకవర్గంలో..		
పురపాలక సంఘం	వార్డు 9(గద్వాల)	250 కుటుంబాలు
గ్రామం	మైలగడ్డ (కేటీదొడ్డి)	190 "
అలంపూర్ నియోజకవర్గంలో....		
పురపాలక సంఘం	వార్డు 3 (అయిజ)	178 "
గ్రామం	ర్యాలంపాడు (అలంపూర్)	185 "

కల్లు సర్వం.. కల్తీమయం

నార్కోటిక్ దాడులతో కలకలం



కల్తీ కల్లు పారబోస్తున్న పోలీసులు

గద్వాల, న్యూస్‌టుడే: జోగులాంబ జిల్లాలో దుకాణాల్లో విక్రయించే కల్లులో సీహెచ్, ఆల్ప్రాజోలం, ఇతర నిషేధిత పదార్థాలు వాడుతున్నారని పక్కా సమాచారంలో నార్కోటిక్ అధికారులు దాడులు చేయటంతో కలకలం రేగుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మత్తుమందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని అధికార యంత్రాంగానికి పూర్తి అధికారాలు ఇవ్వటం తెలిసిందే. నాలుగు నెలల వ్యవధిలో గద్వాల జిల్లాలో నార్కోటిక్ అధికారులు రెండు సార్లు దాడులు చేయడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు సైతం అప్పుడప్పుడూ దాడులు చేస్తున్నాయి. దాడులు చేసిన ప్రతి సారీ కల్లు విక్రయిస్తున్న దుకాణాల్లో నమూనాలను తీసుకోవటం, తాగిన వారికి ప్రత్యేక కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా రావటంతో ఏకకాలంలో 22 మంది కల్లు విక్రేతలపై కేసులు నమోదు చేయటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది..

సరఫరాపై కన్నేది: జిల్లాలో ఈత వనాలు అన్నది వేళ్లమీద లెక్క పెట్టేటన్ని కూడా కనిపించవు. దొరికేది అంతా కల్తీకల్లే. జిల్లాలో పురపాలికల్లో, పంచాయతీల పరిధిలో గ్రామాలు ప్రతిచోటా కల్లు విక్రయాలు అనుమతి ఉన్నవి, లేనివి దుకాణాలు కనిపిస్తుంటాయి. జిల్లా వ్యాప్తంగా 350 వరకు దుకాణాలున్నాయి. రోజుకు రూ.15 లక్షల వరకు విక్రయాలుంటాయి. ప్రతి నెలా మత్తుపదార్థాలు కలిపి తయారీ చేసిన కల్లు వ్యాపారం రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. నెలనెలా వీటి విక్రయాలకు ఇబ్బందుల్లేకుండా ఉండటానికి ఆబ్కారీకి అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నారనే ఆరోపణ కూడా ఉంది. అయితే కల్లు తయారీ చేసి విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు జరుపుతున్న నార్కోటిక్ అధికారులు, తయారీ కోసం మత్తుమందులను సరఫరా చేసే ముఠాపై మాత్రం ఎందుకు దృష్టి సారించడంలేదనే ఆరోపణ ఉంది. మత్తు మందుల సరఫరా ఎవరు చేస్తున్నారనే విషయం విక్రయదారులకు తెలుసు. వారికి అండదండలు అందిస్తున్న ఆబ్కారీ అధికారులకు తెలుసు, కానీ తెలియనిది నార్కోటిక్ అండ్ డ్రగ్ కంట్రోల్ అధికారులకే. అసలు ఈ మత్తు పదార్థాలను ఎక్కడ నుంచి తెస్తున్నారు? ఎవరెవరు ఎవరికి విక్రయిస్తున్నారు? ప్రతి నెలా వీటి వ్యాపారం ఎంత? అనే అంశాలపై దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే అవకాశం లేకపోలేదు.

వారి కనుసన్నల్లోనే..: సీహెచ్, అల్ప్రాజోలం తదితర నిషేధిత పదార్థాల విక్రయాలను జిల్లాలో ఓ మాఫియా నెట్ వర్క్ పెంచిపోషిస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరు చొప్పున గ్రామాలను, దుకాణాలను పంచుకొని వీటిని సరఫరా చేస్తున్నారు. కర్ణాటక, ఆంధ్రా, హైదరాబాద్ నుంచి ప్రతి నెలా ఇవి సరఫరా అవుతున్నట్లు సమాచారం. జిల్లాలో కేటీదొడ్డి మండలంలో నందిన్నె, పాతపాలెం, రంగాపురం, గద్వాల మండలంలో మూడు గ్రామాలకు చెందిన వ్యక్తులు, మల్దకల్ మండలంలో మరో నలుగురు కీలకంగా వ్యవహరిస్తూ మండలాల పరిధిలో అనుచరుల ద్వారా వీటిని చేరవేస్తున్నట్లు సమాచారం. గత నెలలో కేటీదొడ్డి మండలం పాతపాలెంలో పెద్ద ఎత్తున సీహెచ్ పట్టుబడితే కేసును తారుమారు చేసి రంగాపురంలో స్వల్ప పరిమాణంలో పట్టుబడినట్లు చూపించి మమ అనిపించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయండి: కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ సీజన్‌లో రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేయడానికి సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 1.29 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారని, ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి ప్రకారం 12.91 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని, ఆ మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేయాలన్నారు. ఈ ఏడాది పత్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521, మాములు పత్తికి రూ.7,121లుగా ధరలు నిర్ణయించిందని వివరించారు. ఈ సీజన్‌లో ప్రస్తుతం అలంపూర్‌లో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ఆరబెట్టిన పత్తిని తీసుకుని రావాలని, దాంట్లో తేమ శాతం 8-12 మధ్యన ఉండే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ డీఏవో సక్రియా నాయక్, సీసీఐ అధికారి రోహన్ దుబే, తదితరులున్నారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యం

ఎస్‌జీఎఫ్ కుస్తీ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి



రెజ్లింగ్ పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ధన్వాడ, న్యూస్‌టుడే : తమది క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. శుక్రవారం ధన్వాడ అప్పాజీ మైదానంలో 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కప్‌లోనూ రెజ్లింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ధన్వాడలో రెజ్లింగ్ హాలు నిర్మాణం కోసం రూ.11 లక్షలు కలెక్టరు కేటాయించారన్నారు. డీవైఎస్‌వో వెంకటేశ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్, ధన్వాడ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, పేట మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఉపాధ్యక్షుడు హన్మంతు, డైరెక్టర్లు రాంచంద్రయ్య, రాగ్యానాయక్, లక్ష్మయ్యగౌడ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కుస్తీ ప్రారంభం


ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలోని అప్పాజీ మైదానంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 300 మంది పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు పోటీలకు దూరంగా ఉన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి జాతీయ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం కాగా ఆదిలాబాద్ క్రీడాకారులు వందన సమర్పణ చేస్తూ ముందుకు కదిలారు. మహబూబ్‌నగర్ క్రీడాకారులతో ఈ కార్యక్రమం ముగిసింది. తదుపరి ఎమ్మెల్యే పోటీలను లాంఛనంగా మొదలెట్టారు. మధ్యాహ్నం పెద్ద వర్షం పడటంతో మైదానంలో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.

హోరాహోరీగా హ్యాండ్‌బాల్ పోటీలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి పది జట్లు పోటీపడగా కరీంనగర్ - మహబూబ్‌నగర్ మొదటి సెమీ ఫైనల్, ఆదిలాబాద్ - వరంగల్ జట్లు ద్వితీయ సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. చివరికి కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మొదటి సెమీ ఫైనల్‌లో మహబూబ్‌నగర్ - వరంగల్ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్‌లో కరీంనగర్ - హైదరాబాద్ మ్యాచ్ శనివారం మొదటి సెషన్‌లో ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్, నర్సిములు, శ్రీనివాస్, రఫత్ పాల్గొన్నారు.

విస్తీర్ణంలో దేశంలో రెండో అతి పెద్ద పులుల అభయారణ్యం నల్లమల. అరుదైన వన్యప్రాణులు, పక్షులు, వృక్షాలు, ఔషధ మొక్కలకు నెలవు. 2611 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఏటీఆర్‌లో ఎంతో జీవవైవిధ్యం కనిపిస్తుంది. కర్ణాటక సరిహద్దు కృష్ణా తీరం కూడా జీవ జాతులకు ఆలవాలమే. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సందర్భంగా ఇక్కడి విశేషాలు తెలుసుకుందాం.

జీవుల ఆలవాలం.. నిలపాలి కలకాలం



మద్దిమడుగు రేంజ్‌లో కనిపించే అరుదైన చింకార



మూషిక జింకలు



ధన్వాడలో శుక్రవారం నిర్వహించిన వన్యప్రాణుల సంరక్షణ ర్యాలీ

న్యూస్‌టుడే- అమ్రాబాద్, కృష్ణా

ఉమ్మడి పాలమూరు జిల్లా అరుదైన వన్యప్రాణులకు ఆలవాలం. అందులోనూ నల్లమల ప్రత్యేకం. సుమారు 180 కిలోమీటర్ల సరిహద్దుగా ఉన్న కృష్ణానది వేసవిలో జంతుజాలం దప్పిక తీరుస్తూ కాపాడుతోంది. అటవీ అధికారుల చర్యల మూలంగా 10 లోపు ఉన్న పెద్ద పులుల సంఖ్య 38కి చేరుకుంది. క్రమేపీ ఇతర జంతువుల సంఖ్య పెరుగుతోంది. అంతరించి పోయే దశలో ఉన్న జంతుజాతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నల్లమలలో పెద్దపులులతో పాటు జింకలు, మనుబోతులు, దుప్పులు, చిరుతపులులు, అడవి పందులు, ఎలుగు బంట్లు, కొండగొర్రెలతో పాటు ఎన్నో జాతుల జంతువులు నివసిస్తున్నాయి.

ఏం చేస్తున్నారు?

ఒకప్పుడు నల్లమలలో విస్తారంగా ఉన్న మూషిక జింకలు వివిధ కారణాల వల్ల అంతరించి పోయాయి. వానిని పునరుద్ధరించేందుకు అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శన శాల నుంచి తెప్పించి అభివృద్ధి పరుస్తున్నారు. ఇందులో భాగంగా మన్ననూరు రేంజ్‌లోని పిచ్చకుంట్లోని చెరువు ప్రాంతంలో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేసి అందుకు అనువైన వాతావరణ పరిస్థితులు కల్పిస్తున్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 6 ఆడ, 2 మగ మూషిక జింకల చొప్పున 17 బ్యాచులు హైదరాబాద్ నుంచి తెచ్చి నల్లమల వాతావరణానికి అలవాటయ్యే వరకు షెడ్డుల్లో పెంచి నెల తర్వాత అడవిలో వదులుతున్నారు. క్రమేపీ వాటి సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. అటవీప్రాంతం పొడుగునా ప్లాస్టిక్ నిషేధించారు.

చికారాలు ప్రత్యేకం

కృష్ణ జింకలను పోలి ఉండే చింకారాలు ఏటీఆర్‌కే ప్రత్యేకం. నల్లమలలోని మద్దిమడుగు రేంజ్‌తో పాటు కవ్వాల్ పెద్దపులుల అభయారణ్యంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వంపులు తిరిగిన కొమ్ములు, బెదురు చూపులతో అత్యంత పిరికిగా ఉండే చింకారాల అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో ఉండే పశువులు, గొర్రెల మందలు వాటి అభివృద్ధికి ఆటంకంగా మారాయి. అడవిలో లభించే మేతను పశువులు, గొర్రెలు తినిపోవటంతో ఇవి ఆహారం కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే అవకాశం ఉంది. దీంతో ఈప్రాంతంలో పశువులు, గొర్రెల మందలను అధికారులు నియంత్రిస్తున్నారు. వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచటంతోపాటు తాగునీటి వసతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఆవాసాల్లోకి మొసళ్లు, జింకలు

గత 30 ఏళ్ల క్రితం వరకు జింకలు, మొసళ్లను వేళ్లపై లెక్కించేవారు. ఇప్పుడు వాటి సంతతి గణనీయంగా పెరిగింది. నీటి లభ్యతతో పాటు విరివిగా ఆహారం లభించడంతో సంతతి గణనీయంగా పెరిగింది. మొసళ్ల విషయానికి వస్తే మొసలి పిల్ల చాలా చిన్నదిగా ఉంటుంది. నదిలో నుంచి నీరు ఎత్తిపోసే క్రమంలో ఆయా మోటార్ల ద్వారా పంట కాలవలలోకి చేరి సమీపంలోని చెరువులలోకి చేరుతున్నాయి. మనిషి అత్యధికంగా కోడి మాంసం తింటూ ఉండటంతో వాటి వ్యర్థాలు స్థానిక చెరువులు, నీటి కుంటలలో పార వేస్తున్నారు. దీంతో మొసళ్లకు మంచి ఆహారం లభిస్తుండటంతో జనావాసాలలోకి చేరుతున్నాయి. ఒకప్పుడు కర్ణాటక సరిహద్దులో కనిపించే జింకలు ఇప్పుడు పూర్తిగా గ్రామాల శివార్లలోకి చొచ్చుకొచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ మధ్య ఊట్కూరు వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఈ సమస్యపై రైతులు మొరపెట్టుకున్నారు. కృష్ణా మండలం ముడుమాల్ వద్ద జింకల సంరక్షణ కోసం 70 ఎకరాల స్థలం కేటాయించారు. రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఆ తరువాత ఈ కేంద్రం ఏర్పాటు ముందుకు సాగలేదు. ప్రజలకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖాధికారి నీలేష్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

నీటి కుక్కలు



కృష్ణానదిలోని నీటి కుక్కలు

నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న సుమారు 180 కిలో మీటర్ల పొడవైన కృష్ణానదితో పాటు లింగాల, తెలకపల్లి ప్రాంతాల్లో నీటి కుక్కలు కనిపిస్తాయి. చేపలు, ఎండ్రగిచ్చలు ఆహారంగా తీసుకునే నీటి కుక్కలు మత్స్యకారులు చేపల కోసం వేసే వలలో చిక్కుకుని మృతి చెందుతుంటాయి. ఈకారణంగా నానాటికి నీటికుక్కలు అంతరించి పోయే అవకాశం ఉంది. ఇవే కాకుండ పసుపు గొంతు బుల్‌బుల్ పిచ్చుక, స్పాట్ బెల్లీడ్ డేగ-గుడ్లగూబ, బ్లాక్ బాజా లాంటి అరుదైన పక్షి జాతులు నల్లమలలో ఉన్నాయి.

అండర్-19 క్రికెట్ ఫైనల్‌కు పాలమూరు జట్టు

సెమీస్‌లో ఖమ్మంపై 60 పరుగుల తేడాతో ఘన విజయం



సెమీస్‌లో నెగ్గి ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. శుక్రవారం వరంగల్‌లోని మొగిలిచర్ల మైదానంలో నిర్వహించిన సెమీస్‌లో ఖమ్మం జట్టుపై 60 పరుగుల తేడాతో నెగ్గింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 పరుగులతో ఆకట్టుకున్నాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి అబ్దుల్ రాఫె 110 (146 బంతుల్లో 4×11, 6×2) సాయంతో శతకం బాదాడు. కె.సాహిల్ 45, నగేశ్ 25, షాదాబ్ అహ్మద్ 22 పరుగులు చేశారు. అనంతరం ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ జట్టు నుంచి ముఖీత్ 4, బి.రాజు, శశాంక్, షాదాబ్, సాహిల్ ఒక్కో వికెట్ తీశారు. శనివారం ఫైనల్‌లో జిల్లా జట్టు కరీంనగర్‌తో తలపడనుంది. ఫైనల్‌కు చేరిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా, సంఘం సభ్యులు అభినందించారు.


ఆటలతో ఐక్యత, ఆరోగ్యం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అంజయ్యయాదవ్. చిత్రంలో నవీన్‌కుమార్‌రెడ్డి, నరేందర్ తదితరులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఐకమత్యం, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, అలాంటి ఆటలకు నిత్యం కొంత సమయం కేటాయించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ మినీస్టేడియంలో భారాస నాయకుడు నందారం అశోక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న క్రీడలో రాణించాలని క్రీడాకారులను కోరారు. ఈ టోర్నమెంట్ 15 రోజులపాటు జరుగుతుందని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 70 టీంలు ఇందులో పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ నరేందర్, వైస్‌ఛైర్మన్ నటరాజ్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్, బచ్చల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర కోటితో అలంకారం.. ఆకట్టుకునే రూపం



కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. రూ.50 లక్షలు విలువజేసే నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌శెట్టి, సభ్యులు పాల్గొన్నారు. వరిదేల శమీవృక్షం వద్ద ఉన్న దుర్గామాతను గాయత్రి అవతారంలో అలంకరించారు.

అలంపూర్ ఆలయాల ఛైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి



ఆలయాల నూతన ధర్మకర్తల సభ్యులు, చిత్రంలో సంపత్‌కుమార్

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాల నూతన ధర్మకర్తల కమిటీ సభ్యులతో శుక్రవారం ఈవో పురేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ ఛైర్మన్‌గా కొంకల నాగేశ్వర్‌రెడ్డి పేరును ప్రతిపాదించారు. అందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందు కమిటీ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఛైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మిఠాయి తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పదవులు ఉంటాయన్నారు. ఆర్డీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, టెలికం సలహా సంఘం సభ్యుడు ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వసతుల కల్పనకు చర్యలు



దేవరకద్రలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గ్రంథాలయాలకు వస్తున్న పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసకుంటామని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని కేంద్ర గ్రంథాలయాన్ని, దేవరకద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడున్న పాఠకులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా.రియాజ్ గ్రంథాలయంలో సమస్యలపై యువతను ఆరాతీయగా భవనాన్ని విస్తరించాలని, మరిన్ని కుర్చీలు, పోటీపరీక్షల కొత్త పుస్తకాలు, మాసపత్రికలను సమకూర్చాలని కోరారు. మహబూబ్‌నగర్, నారాయణపేట గ్రంథాలయాల కార్యదర్శులు మనోజ్‌కుమార్, సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యలో భారీ కుంభకోణం

- సభ్యులకు తెలియకుండానే వారి పేర్లపై రుణాలు
- లబోదిబోమంటున్న మహిళలు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పాలమూరు పురపాలిక 17వ వార్డు కోయనగర్ శ్రీసాయి మహిళా సంఘాల సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్ - స్లమ్ లెవల్ ఫెడరేషన్)లో భారీ కుంభకోణం వెలుగు చూసింది. మహిళా సంఘాల పొదుపు ఖాతాలు పర్యవేక్షించే ఓ ఆర్పీ సభ్యులుగా ఉన్న మహిళలకు తెలియకుండానే వారి పేర్ల మీద భారీ మొత్తంలో రుణాలు తీసుకుని అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్ఎల్ఎఫ్ పరిధి పలు సంఘాల మహిళలు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేయించినా మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా డీఎంసీ శివకుమార్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌లో మహిళల పొదుపు సొమ్ముతో పాటు రుణాల పేరిట ఆర్పీ పెద్ద మొత్తంగా అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ఎమ్మెల్యే, పుర కమిషనర్ ఆదేశాలతో ముగ్గురు సీవోలు, నలుగురు సీనియర్ ఆర్పీలతో కూడిన మూడు బృందాలను ఏర్పాటు చేసి శనివారం నుంచి కోయనగర్ ఎస్ఎల్ఎఫ్‌పై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అవకతవకలు వాస్తవమేనని, ఇటీవల కొంత మంది మహిళలు ఆర్పీపై ఫిర్యాదు చేయడంతో నయానా భయానా రూ.6 లక్షల వరకు సొమ్ము రికవరీ చేయించానని వార్డు కౌన్సిలర్ జంగమ్మ 'న్యూస్‌టుడే'తో చెప్పారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో మిగతా సంఘాల వాళ్లు కూడా అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు అధికారులు ఏం చేసినట్లు?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 32 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు. సభ్యులు బ్యాంకు లింకేజీ కింద రుణాలు తీసుకోవాలంటే వారి పేర్లతో ఆర్పీ సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ - మైక్రో క్రెడిట్ ప్లాన్) తయారు చేసి ఒక్కో సభ్యురాలి సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. ఎంసీపీని బ్యాంకులో సమర్పించాక క్షేత్రాధికారి (ఫీల్డ్ ఆఫీసర్) పరిశీలించి ఆయా మహిళలతో మాట్లాడి మరోమారు వారి సంతకాలు తీసుకుని వారి ఖాతాల్లోనే రుణ మొత్తం జమ చేయాలి. ఇందుకు భిన్నంగా జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకుకు చెందిన క్షేత్రాధికారి ఆర్పీ చెప్పినట్లు విని మహిళల సంతకాలు తీసుకోకుండానే ఒక్కో మహిళ పేరు మీద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేసి నిధులు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఇలా 32 సంఘాల్లోని చాలా మంది సభ్యుల పేర్ల మీద వారికి తెలియకుండానే ఆర్పీ పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు మహిళలు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం నిర్వహించే విచారణకు అన్ని సంఘాల సభ్యులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఇతర దస్త్రాలతో హాజరు కావాలని సూచించామని, విచారణలో అవకతవకలు పూర్తిస్థాయిలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుందని మెప్మా డీఎంసీ పేర్కొన్నారు.

నకిలీ మావోయిస్టును పట్టించిన సాంకేతికత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గిరిధర్‌రావు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : నక్సలైట్‌నని ఓ రైస్‌మిల్లు వ్యాపారిని బెదిరించి ఫోన్‌పే ద్వార డబ్బు తీసుకున్న ఓవ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శుక్రవారం వనపర్తి కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్‌రెడ్డి ఇటీవల వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోలీపూర్ గ్రామానికి చెందిన మిల్లు యజమాని శేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి తాను మాజీ నక్సలైట్‌నని. రైస్‌మిల్లు అసోసియేషన్ నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. డబ్బులివ్వకుంటే చంపుతానని బెదిరించారు. ఈ నెల రెండో తేదీన హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని కమిషన్ బేస్డ్ వ్యక్తికి చెందిన ఫోన్‌పే నంబరుకు రూ.8 వేలు జమ చేయాలని శేఖర్‌రెడ్డికి చెప్పారు. బాధితుడు రూ.8 వేలు పంపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖిల్లాగణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడు డబ్బు తీసుకునేందుకు కమిషన్ బేస్డ్ వ్యక్తి ఇంటి వద్దకు రాగా కొత్తకోట సీఐ రాంబాబు, ఖిల్లాగణపురం ఎస్సై సురేశ్‌గౌడ్ పట్టుకున్నారు. అతన్ని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడు పెద్దపల్లిలో సుల్తానాబాద్, కరీంనగర్, సుబేదారి, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొందరిని బెదిరించి డబ్బు తీసుకోవడంతో కేసులు నమోదయ్యాయి. కేసును త్వరగా ఛేదించిన కొత్తకోట సీఐ, ఖిల్లాగణపురం ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు ఇస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐతో పాటు వనపర్తి సీఐ నాగభూషణంరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారికి సహకరిస్తున్న అయిజ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ టి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు చేశారు. బాధ్యతారాహిత్యం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం కారణంగా శాఖాపరమైన చర్యలు చేపట్టారు. రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారికి సహకరిస్తున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అనంతరం రుజువుకావడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఎస్పీ కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో తెలిపారు.

ఒకే రోజు ముగ్గురిపై శునకాల దాడి



గాయాలపాలైన రేవంత్

మానవపాడు, న్యూస్‌టుడే: ఒకే రోజు ముగ్గురు వ్యక్తులపై శునకాలు దాడిచేశాయి. అమరవాయి గ్రామానికి చెందిన పరశురాముడు కుమారుడు రేవంత్ శుక్రవారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకురావడానికి ఇంటి నుంచి దుకాణానికి బయలు దేరాడు. వెళ్తున్న క్రమంలో రేవంత్‌పై కుక్కల గుంపు దాడికి పాల్పడింది. బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు, కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని శునకాలను చెదరగొట్టారు. అప్పటికే బాలుడిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు రేవంత్‌ను కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన రామదాసు కుమారుడు శివపైనా కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పెద్దఆముదాలపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తుండగా అమరవాయిలో శునకాలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. గ్రామాల్లో శునకాల స్వైరవిహారాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

గద్వాల గ్రామీణం: 9052211532 | అలంపూర్: 8008573916
అయిజ: 8008573922 | వడ్డేపల్లి పట్టణం: 8008573930

సమస్య: ఎద్దులగూడెం నీటి ట్యాంక్ కింద తాగునీరు వృథాగా వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. -పరుశ, గ్రామస్థుడు

సమాధానం: వాల్ సరిగా తిప్పనందుకు నీరు ఇలా వెళ్లింది. ఇక ముందు ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. -కిష్టన్న పంచాయతీ కార్యదర్శి, పల్లగడ్డపాడు

- న్యూస్‌టుడే, మల్దకల్

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... దేవర, సత్యం సుందరం, శ్వాగ్
అయిజ: శివసాయి : దేవర, భువనేశ్వర్ : బఘీరా్భూమి, యమకంత్రి, మాధవ్ : శ్వాగ్
–న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయి



అయిజలో గాయత్రీ దేవిగా.. శాంతినగర్‌లో రూ.50 లక్షల నగదుతో లక్ష్మీదేవిగా.. మానవపాడు: జల్లాపురంలో దుర్గామాత.. ఐజిగ్యాలలో గాయత్రీ దేవిగా.. ధరూరు కాళికాలయంలో.. మల్దకల్: వరలక్ష్మీదేవి అలంకారంలో.. పెద్దదిన్నెలో కొలువైన వెంకటేశ్వరస్వామి

భవానీ.. బహు రూపే!



గద్వాల వాసవీ మాత ఆలయంలో మహిళల కుంకుమార్చన



రాజోలి: బతుకమ్మతో పొదుపు సంఘాల మహిళలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. జిల్లాలోని ఆలయాల్లో భవానీ ప్రత్యేక అలంకరణలో నేత్ర పర్వం చేస్తున్నారు. రెండో రోజు కొన్ని చోట్ల గాయత్రీగా మరికొన్ని చోట్ల ధన లక్ష్మిగా ఇంకా బాలా త్రిపురసుందరిగా కనిపించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, మంగళహారతి తదితరాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం చేశారు. రాజోలిలో పొదుపు సంఘాల మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. నవరాత్రి సందర్భంగా పలు ఇతర ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు. అలంపూర్ ఆలయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకున్నారు. –న్యూస్‌టుడే బృందం



వడ్డేపల్లి మండలం పైపాడులో..



గట్టు భవానీమాత ఆలయంలో..



ఉండవల్లి: అంబేడ్కర్‌కాలనీలో..



గద్వాల కాళికాదేవి ఆలయంలో..



కుంకుమార్చన మండపంలో పూజలు

మత్స్యకారుల సంక్షేమానికి కృషి: కలెక్టర్



చేప పిల్లలు వదులుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మత్స్యకారుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద సృష్టికి ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా కలెక్టర్ సంతోష్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం గద్వాల మండలంలోని సంగాల చెరువులో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రోజు కట్ల, బొచ్చ, శీలావతి, మృగాల వంటి నాలుగు రకాలకు చెందిన 65,400 చేప పిల్లలను వదిలామని వివరించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్స్యకారులు తాము ఉత్పత్తి చేసిన మత్స్య సంపదను దళారులకు ఇవ్వకుండా సొంతంగా మార్కెట్ చేసుకుని ఆర్థికంగా లాభపడాలన్నారు. మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుజాత, జిల్లా మత్స్య శాఖ అధికారిణి షకీలాబానో, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు గోపాల్, సంగాల చెరువు మత్స్యకార సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై దృష్టి: ఎంపీ



దర్శనానికి వస్తున్న ఎంపీ డీకే అరుణ, తదితరులు

అలంపూర్ : శక్తి పీఠమైన జోగులాంబ ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. అర్చకులు, ఈవో పురేందర్ స్వాగతం పలికారు. స్వామి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి, ఉత్సవాలకు వచ్చే భక్తులకు వసతులు కల్పించాలన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, భాజపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ గ్యాస్ సద్వినియోగానికి పిలుపు



ధ్రువపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా అందజేసే రాయితీ గ్యాస్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శేక్షావలిఆచారి పేర్కొన్నారు. శుక్రవారం అయిజలోని రేషన్ దుకాణాల వద్ద అర్హులైన మహిళలకు రాయితీ ధ్రువపత్రాలను అందజేశారు. అర్హులైన వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు మధుకుమార్, నాయకులు హనుమన్న, పాండు, మధు, ముక్కెరన్న, కృష్ణారెడ్డి, శివరాజు, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిగా చెల్లిస్తేనే కొత్త రుణాలు



మహిళలతో మాట్లాడుతున్న వెంకటేశ్

అయిజ : పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులు అందించే రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బీఐ అయిజ శాఖ మేనేజర్ వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామైక్యసంఘం అధ్యక్షురాలు, అమ్మ ఆదర్శపాఠశాల ఛైర్మన్ మహేశ్వరి ఆధ్వర్యంలో పొదుపు సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు రుణాలు తీసుకున్న సంఘాల వారు పూర్తిగా చెల్లిస్తే వాటి స్థానంలో కొత్తరుణాలు మంజూరీ చేస్తామన్నారు. పొదుపు సంఘాల వారు బ్యాంకులతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మహిళల స్వయం ఉపాధి కోసం నాలుగు యూనిట్లకు రుణాలు అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం అన్నపూర్ణ, సీసీ జానకి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నతస్థితి



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి హృదయరాజు

మల్దకల్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ భవిష్యత్తుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుందని ఈస్థాయిలో కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఇంటర్ జిల్లా విద్యాధికారి హృదయరాజు సూచించారు. మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూ.కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగత కార్యక్రమం ప్రధానాచార్యులు కృష్ణ అధ్యక్షతన నిర్వహించగా హాజరై మాట్లాడారు. పూర్వ ప్రధానాచార్యులు రమేషలింగం మాట్లాడుతూ కళాశాలకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక ర్యాంకులు సాధించిన చరిత్ర ఉందని దీన్ని నిలబెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రామాంజనేయులగౌడ్, నరసింహులు, గోవర్ధన్‌శెట్టి, భాగ్యలక్ష్మీ, దేవసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వినియోగం వివాదాస్పదం

గట్టు : చాగదోణ గ్రామంలో ఓ మంచినీటి బావి నీటి వినియోగం ఇరువర్గాల మధ్య వివాదాస్పదంగా మారింది. చివరకు పంచాయతీ పోలీసుల వరకు చేరింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామంలోని ఓ మంచినీటి బావిని ఓ సామాజికవర్గం వారు ఇప్పటివరకు వినియోగించుకుంటున్నారు. అయితే ఇటీవల అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సదరు నీటిని వాడుకునేందుకు వీలు లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూవచ్చారు. దీంతో వారి అభ్యంతరాన్ని వ్యతిరేకిస్తూ ఓ సామాజిక వర్గం వారు పంచాయతీని పోలీసుల దృష్టికి తెచ్చేందుకు ఠాణాకు చేరుకున్నారు. సమస్యపై వారు పోలీసులకు ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. విషయాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు వారికి సర్దిచెప్పటంతో వెనుదిరిగి వెళ్లారు.

నిలకడగా తుంగభద్ర ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే : తుంగభద్ర నదిలో శుక్రవారం 4,329 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆనకట్ట ఎగువ ప్రాంతంలో గురువారం రాత్రి భారీవర్షం పడింది. దీనివల్ల శనివారం నాటికి ఆనకట్టలో ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.6 అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం ఉందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.2 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 4.9 అడుగులుగా ఉంది.

గరిష్ఠ స్థాయికి సుంకేసుల: సుంకేసుల జలాశయంలో శుక్రవారం 292 మీటర్ల గరిష్ఠ స్థాయి నీటిమట్టం నమోదైంది. ఎగువ నుంచి జలాశయానికి 2400 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, గేట్లన్నీ మూసి ఉంచి కేసీ కాలువకు మాత్రం 2400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లుగా డ్యాం జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 1.23 టీఎంసీల పూర్తి స్థాయి నీరు నిల్వ ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు'

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపైనే కాకుండా, ప్రధాన కూడళ్ల వద్ద గద్వాల సంస్థానాల చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఆధారాలను కనబడకుండా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్‌రావు, అచ్చన్నగౌడు ఒక ప్రకటనలో ఆరోపించారు. రెండు రోజుల కిందట పట్టణంలో వీచిన గాలికి పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ఓ నాయకుడి కటౌట్ కుప్పకూలడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. అధికారులు పట్టణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన వాటనిఇ తొలగించాలని డిమాండ్ చేశారు.

కడీలు తేలి ప్రమాదకరంగా వంతెన



ఎల్కూరు నుంచి ఉదండాపురం రహదారికి ఉన్న రెండు వంతెనలు శిథిలావస్థకు చేరడంతో కడీలు తేలి ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాలు గురై గాయాల పాలవుతున్నారు. గట్టు, అయిజ, మల్దకల్ మండలాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని, రాగానే పనులు చేయిస్తామని పీఆర్ ఏఈ బషీర్ వివరించారు. – న్యూస్‌టుడే, మల్దకల్

ప్రాంగణం.. అలంకారప్రాయం



పల్లెల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం క్రీడా కిట్లు పంపిణీ చేసినా ప్రాంగణాల వద్ద వసతులు లేకపోవడంతో ఆటలు ఆడటం లేదు. మండలంలోని తుమ్మిళ్ల, రాజోలి, పెద్దతాండ్రపాడు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ముండ్లదిన్నెలో క్రీడా ప్రాంగణం ఆటలు ఆడేందుకు ఏ మాత్రం అనువుగా లేదు. రాజోలిలో రెండు చోట్ల చిన్నపాటి స్థలంలో ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతో ముళ్లపొదలు పెరిగాయి. కిట్లు అందించామని, పంచాయతీలు క్రీడలు జరిగేలా పర్యవేక్షణ చేసేలా చూస్తామని ఎంపీడీవో ఖాజామొయినుద్దీన్ తెలిపారు. – న్యూస్‌టుడే, రాజోలి

భవనం నిరుపయోగం



గట్టు వేంకటేశ్వరస్వామి ఆలయం ముందు రూ.3 లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా మారింది. భవనం ముందు ప్రహరీని గతంలో కూల్చివేయటంతో, భవనంలో అపరిశుభ్రకర వాతావరణం నెలకొంది. ఇదే ఆవరణలో ఓ మినీ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రహరీని పూర్తి చేయించి, గేటు ఏర్పాటు చేయిస్తే భవనం ఉపయోగంలోకి వస్తుందని, ఆదిశగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమస్యను పరిశీలించి చర్యలు చేపట్టేందుకు పంచాయతీ కార్యదర్శికి సూచిస్తామని ఎంపీడీవో చిన్నయ్య వివరణనిచ్చారు. –న్యూస్‌టుడే, గట్టు

పొలాలనూ వదలడంలేదు



జల్లాపురం శివారులోని ఓ పంట పొలంలో కుప్పగా ఉన్న ఖాళీ మద్యం సీసాలివి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని పోలీసులు హెచ్చరిస్తున్నా.. జరిమానాలు విధిస్తున్నా కొందరిలో మార్పు రావడంలేదు. పొలాలతో పాటు ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా సిట్టింగ్ వేస్తున్నారు. మత్తులో సీసాలను పగలకొడుతున్నారు. దీనివల్ల పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు గాయపడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. –న్యూస్‌టుడే, మానవపాడు

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలు శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం రామాపురం, జిల్లేడుదిన్నె, జూలేకల్‌లో డ్రైడే సందర్భంగా వీధులు పరిశీలించి, అయిల్ బాల్స్ వేసి దోమలు పుట్టకుండా నివారించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు అశోక్, ప్రియాంక పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ధరూరు, న్యూస్‌టుడే: ఖమ్మంపాడు గ్రామంలో గురువారం రాత్రి ఉరుములతో కూడిన వర్షానికి పిడుగుపాటుకు గురై ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు బోయ రాములు వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉంచగా పిడుగు పడింది. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రాములు కోరారు.

బ్యాంక్ లింకేజీ రుణాలతో ఆర్థిక ఎదుగుదల



మల్దకల్ జొన్నరొట్టెల మిషన్‌ను అందజేసిన అధికారులు

మల్దకల్, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఇతర రుణాలను అందజేస్తోందని డీఆర్డీవో నర్సింగరావు తెలిపారు. మండల కేంద్రంలో గ్రామైక్య సంఘాల వారికి బ్యాంక్ లింకేజీ రుణాలతో యంత్రాలను, పరికరాలను అందజేసి మాట్లాడారు. మల్దకల్ మంజునాథ మహిళా సంఘం సభ్యురాలైన లక్ష్మీదేవికి రూ.3 లక్షలతో రొట్టెల తయారీ యంత్రంతో కేంద్రాన్ని అడిషనల్ డీఆర్డీవో నరసింహులతో కలిసి ప్రారంభించారు. బాపూజీ పొదుపు మహిళా సంఘం సభ్యురాలు సుజాతకు కాజాలు, గుండీల మిషన్‌షాపును రూ.2 లక్షలతో ప్రారంభించారు. కుర్తిరావులచెర్వులో మహిళా సంఘం సభ్యురాలు సావిత్రికి రూ.1.50లక్షలతో ఎంబ్రాయిడరీ మిషన్ షాపును, మద్దలబండలో సరోజినీ మహిళా సంఘం సభ్యురాలు లక్ష్మికి రూ.3లక్షల రుణంతో కిరాణం షాపును ప్రారంభించారు. డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం నరహరి, సీసీలు మండల సమాఖ్య ఓబీలు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కవాతు

శాంతినగర్, న్యూస్‌టుడే: శాంతినగర్‌లో శుక్రవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కన్యాకాపరమేశ్వరి ఆలయం నుంచి సంఘసేవకులు ప్రధానరహదారి మీదగా రాముల వారి ఆలయం వరకు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న సంఘ్ సేవకులు

సస్యరక్షణ చర్యలతో పంటలకు మేలు

మానవపాడు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు సాగుచేసిన పంటలు తెగుళ్లు, చీడపీడల బారిన పడకుండా సకాలంలో అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీఏవో సక్రియనాయక్ సూచించారు. మండల పరిధి చెన్నిపాడు గ్రామంలో సాగవుతున్న ఆయా పంటలను శుక్రవారం డీఏవో పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అక్కడక్కడా పత్తి, మిర్చి, కంది తదితర పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవసరమైన మందులను పిచికారీ చేసుకొని పంటలను కాపాడుకోవాలని డీఏవో రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మణిప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు మేపినందుకు జరిమానా

శాంతినగర్, న్యూస్‌టుడే: వడ్డేపల్లి పురపాలికలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవరణలో వనమహోత్సవంలో మొక్కలు పెంచారు. వాటిని శుక్రవారం పైపాడుకు చెందిన కుర్వమద్దిలేటి తన గొర్రెలతో మేపాడు. దీనికి కమిషనర్ లక్ష్మారెడ్డి చర్యలు తీసుకున్నారు. మొక్కలు మేపిన అతని నుంచి రూ.వెయ్యి అపరాధ రుసుం కింద వసూలు చేశారు. పురపాలికలో మొక్కలను ఎవరైనా మేపితే వారి నుంచి అపరాధ రుసుంతోపాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వామ్మో.. కుక్కలు!



ఒంటరిగా వెళుతున్న చిన్నారులపై దాడులు

అయిజ, మానవపాడు, ఉండవెల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ జనాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని నియంత్రించలేకపోతున్నారు. పట్టణాలైన గద్వాల, అయిజ, వడ్డేపల్లిలో తరచూ కుక్కకాటుకు గురవుతూనే ఉన్నారు. ఏటా రెండు, మూడు సార్లు శునకాలు మూకుమ్మడిగా దాడిచేసి గాయాలపాలు చేస్తూనే ఉన్నాయి. తాజాగా మానవపాడు మండలం అమరవాయిలో ఆరేళ్ల బాలుడిపై శుక్రవారం శునకాలు మూకుమ్మడిగా దాడిచేసి తీవ్రగాయాల పాలు చేయగా బాలుడిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అధికారులు చోద్యం చూస్తున్నారు.

రాత్రయితే దడే: ప్రధాన రహదారులపై వెళుతున్న పాదచారులు, ద్విచక్రవాహన చోదకులను వదలకుండా శునకాలు దాడిచేస్తున్నాయి. రాత్రిళ్లు కాలనీల్లో తిరగాలంటే దడపుడుతోంది. వెంటాడుతూ గాయాలపాలుచేస్తున్నాయి. ఎక్కువగా చిన్నారులే కుక్కల బారినపడుతున్నారు. గ్రామ పంచాయతీ, పురపాలిక అధికారులు వాటిని దూరప్రాంతాలకు తరలించాల్సి ఉంది. కుక్కల తరలింపు నామమాత్రంగా జరుగుతుండటంతో వాటి సంఖ్య పెరుగుతూనే ఉంది. చికెన్, మాంసం, చేపల దుకాణాలు, హోటళ్లు తదితరాల వద్ద గుంపులు, గుంపులుగా ఉంటున్నాయి. ఆయా దుకాణాల వద్ద వ్యర్థాలను తినేందుకు అక్కడి చేరుకుంటున్నాయి. వీధి కుక్కలను నియంత్రించకపోవడంతో కుక్కకాటు బారిన పడాల్సివస్తోంది.



మానవపాడులో ప్రధాన రహదారిపై కుక్కల గుంపు

ఇవిగో దృష్టాంతాలు

- మానవపాడు మండలం అమరవాయిలో శునకాల దాడి జరగడం ఇది రెండో సారి. ఇటీవల మానవపాడు, జల్లాపురం గ్రామాల్లో చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి.
- అయిజ పట్టణంలో ఇటీవల ఎస్సీ కాలనీలో, బుడగజంగాల కాలనీలో చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు.
- వడ్డేపల్లి మండలం కొంకలలో ఇటీవల రెండు సార్లు మూకుమ్మడి దాడులు చేశాయి. ఒకసారి ముగ్గురు చిన్నారులను గాయాలపాలు చేయగా, మరోసారి ఒకరిపై దాడిచేశాయి.
- ఉండవెల్లి మండలంప్రాగటూరులో రెండు నెలలకింద ఐదుగురు చిన్నారులపై మూకుమ్మడిగా దాడిచేసి గాయాల పాలుచేశాయి.
- రాజోలిలో ఆరుమాసాల కింద రెండు సార్లు దాడి చేసి ఆరుగురు చిన్నారులను గాయాలపాలు చేశాయి.
- గద్వాల పట్టణంలో ఇటీవల రెండు చోట్ల కుక్కల దాడిలో చిన్నారులు గాయాల పాలయ్యారు.

చర్యలు తీసుకుంటాం: పట్టణంలో శునకాల నియంత్రణపై చర్యలు తీసుకుంటాం. గతంలో రెండు, మూడుసార్లు వాటిని దూర ప్రాంతాలకు తరలించాం. అయినా మళ్లీ వస్తూనే ఉన్నాయి. ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని పూర్తిగా వాటిని తరలించేందుకు కృషిచేస్తాం.
–దేవన్న, పుర ఛైర్మన్, అయిజ

న్యాయవాదులు విధుల బహిష్కరణ

జడ్చర్ల, న్యూస్‌టుడే: మాదన్నపేటలో అబ్దుల్ సలీం అనే న్యాయవాదిపై పోలీసుల దాడికి నిరసనగా శుక్రవారం జడ్చర్ల కోర్టులో వరుసగా రెండో రోజు న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ న్యాయవాద రక్షణ చట్టం తీసుకొచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని, న్యాయవాదిపై దాడి చేసిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాలిక్ షాకీర్, మహేశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, ప్రశాంత్, పురుషోత్తం, హఫీజా, ఇఫ్తేకారుద్దీన్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయంలోకి గొర్రెల మంద



మండల కార్యాలయంలో భద్రత కొరవడింది. ఈగేటు లోపల తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. కార్యాయంలోకి గొర్రెల మంద వెళ్లడంతో కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది , అధికారులు ఎవరూ పట్టించు కోనందున ఏకంగా గొర్రెల మంద లోపలకు రావడం విమర్శలకు దారి తీసింది. –న్యూస్‌టుడే, మల్దకల్

శిక్షణ సద్వినియోగంతో ఉపాధి

రాజోలి : నాబార్డు సహకారంతో అలీప్ సంస్థ వారు అందిస్తున్న జూట్ బ్యాగుల ఉచిత శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సొంతంగా వ్యాపార ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని నాబార్డు డీడీఎమ్ మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాజోలిలో నిర్వహిస్తున్న రెండో విడత జూటు బ్యాగు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళలతో మాట్లాడి, ఇప్పటి వరకు ఏమి నేర్చుకున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆసక్తి ఉంటే నాబార్డు ద్వారా కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. ఏపీఎమ్ మార్తమ్మ, సీసీ మద్దిలేటి, గ్రామైక్య సంఘం అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

నేడు క్లస్టర్ పథకం ప్రారంభంపై సమావేశం

రాజోలి, న్యూస్‌టుడే: రాజోలిలో చేనేత కార్మికులకు మంజూరైన క్లస్టర్ పథకం ప్రారంభించేందుకు శనివారం సమావేశం నిర్వహించనున్నట్లుగా జిల్లా చేనేత ఏడీ గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని అంబాభవానీ మాత ఆలయ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నామన్నారు. 400 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరే ఈ పథకంపై మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక చేపడతామని, నేతన్నలంతా సహకరించాలని ఆయన కోరారు.